# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక :170 ప్రచురణ : హైదరాబాద్ శనివారం,2-05-2026 పేజీలు: 8 వెల : 3- 00


## శంషాబాద్‌లో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్





శంషాబాద్‌లో 150 ఎకరాల్లో ఇంటర్నేషనల్ బస్ టర్మినల్ నిర్మించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో భేటీ అయిన సీఎం, సంస్థ పురోభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కార్మికుల పట్టుదల వల్లే ఆర్టీసీ దేశంలోనే నెంబర్ వన్ సంస్థగా నిలిచిందని సీఎం కొనియాడారు. కేవలం ప్రశంసలతోనే ఆగిపోకుండా.. సంస్థ భవిష్యత్తు కోసం భారీ ప్రణాళికలను ప్రకటించారు. ఏటా డీజిల్ కోసం పెడుతున్న 2 వేల కోట్ల ఖర్చును తగ్గించేందుకు వెయ్యి కొత్త ఈవీ బస్సులను కొనుగోలు చేయబోతున్నట్లు సీఎం తెలిపారు. వీటిని మెట్రోతో అనుసంధానం చేయడమే కాకుండా, మినీ బస్సులను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు.ఆర్టీసీలో ఉన్న బకాయిలు మా హయాంలో వచ్చినవి కావు.. కానీ వాటిని క్లియర్ చేసే బాధ్యత మాదే అని సీఎం భరోసా ఇచ్చారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టామని తాజాగా ఉద్యోగుల కోసం వెయ్యి కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేశామని ప్రకటించారు.

ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తికి సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారు.

**మహాలక్ష్మి పథకం – ఆర్థిక చేయూత**

మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటికే 8 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీకి అందించామని.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్మికుల హక్కులను కాపాడుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.సంస్థ ఆగిపోతే ఊపిరి పోయినట్లే.. రాజకీయాలకు అతీతంగా సంస్థను కాపాడుకోవాలి. ఒక్క డ్రైవర్‌ను కూడా తొలగించే ప్రసక్తే లేదు అని సీఎం హామీ ఇచ్చారు. యూనియన్లు, విలీనం వంటి అంశాలపై కార్మిక సంఘాలే చర్చించుకుని స్పష్టమైన ప్రణాళికతో రావాలని సూచించారు. కార్మికులు, యాజమాన్యం మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని.. ఆర్టీసీ సమస్యలను వంద శాతం పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.


## ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్

హైదరాబాద్: రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని.. అలాగే, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని తెలిపారు. శుక్రవారం (మే 1) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాల కార్మిక సంఘాల నేతల అభ్యర్థనపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలానికి 3 రోజుల వేతనం ఇచ్చేందుకు, కేసుల ఎత్తివేతకు అంగీకరించారు.

ఈ మేరకు సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపించినందుకు సీఎంకి ధన్యవాదాలు తెలిపారు కార్మిక సంఘాల ప్రతినిధులు.

డిమాండ్ల పరిష్కారం కోసం ఇటీవల తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపింది. చర్చలు సఫలం కావడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించారు.

## సామాన్యుడి నడ్డి విరుస్తారా.? గ్యాస్ ధరల పెంపుపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం





కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధరలను భారీగా పెంచడంపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం సామాన్యుడి నడ్డి విరిచేలా ఉందని ఆయన మండిపడ్డారు.19 కేజీల కమర్షియల్ గ్యాస్ ధరను ఏకంగా 993 రూపాయలు అంటే.. సుమారు వెయ్యి రూపాయల వరకు పెంచడాన్ని మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం ధర పెంచడం ఏంటని ఆయన ప్రశ్నించారు.

ఈ పెంపు వల్ల హోటళ్లు, కేఫ్‌లు, రెస్టారెంట్లతో పాటు రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులపై కోలుకోలేని దెబ్బ పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటల్లోపే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడాన్ని మంత్రి ఎద్దేవా చేశారు. ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమేనని ఆయన దుయ్యబట్టారు.కమర్షియల్ గ్యాస్ ధర పెరగడం అంటే పరోక్షంగా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టడమేనని, దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో సిలిండర్ రేటు మూడు వేలకు పైగా చేరుకుంది.. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

వాణిజ్య సిలిండర్ల ధరలను మే 1న కేంద్రం భారీగా పెంచింది. ఒకేసారి.. 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరపై రూ. 993 పెరిగింది. దీంతో.. ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ల ధరలు రూ. 2,078.50 నుంచి రూ. 3,071.50కి పెరగ్గా, ముంబైలో రూ. 2,031 నుంచి రూ. 3,024కి చేరాయి.

కమర్షియల్ సిలిండర్?పై ధరను ఒకేసారి దాదాపు వెయ్యి రూపాయల దాకా పెంచడంతో హోటల్స్, హాస్టళ్లపై తీవ్ర ప్రభావం పడింది. ఒక్క హైదరాబాద్?లోనే నెలకు 6 నుంచి 6.5 లక్షల కమర్షియల్ సిలిండర్లు విక్రయాలు జరుగుతాయి. టీ స్టాల్‌లు నుంచి స్టార్? హోటళ్ల వరకు నెలకు 4 నుంచి 5.50 లక్షల సిలిండర్లకు అవసరం ఉంటుంది. ఇండస్ట్రీలకు మరో 1.50 లక్షలు అదనంగా డిమాండ్ ఉంది. ఈ మొత్తం కమర్షియల్ సేల్స్ విలువ నెలకు రూ.140 నుంచి రూ.150 కోట్లకు చేరుతుందని గ్యాస్ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి.

## పెండింగ్ చలాన్ల పేరుతో మళ్లీ బండి జప్తు: హోం సెక్రటరీ, డీజీపీలకు హైకోర్టు నోటీసులు

**వాహనాలు సీజ్ చేయవద్దంటూ గతంలోనే హైకోర్టు ఆదేశాలు**

**హైకోర్టు ఆదేశాలను పాటించకుండా వాహనాలు సీజ్ చేస్తున్న పోలీసులు**

**హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన బాధితుడు**




పెండింగ్ చలాన్లు ఉన్నాయనే నెపంతో వాహనాలను జప్తు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. న్యాయస్థానం గతంలో జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నందుకు గాను ఉన్నతాధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. పెండింగ్ చలాన్లు ఉన్నంత మాత్రాన పోలీసులు వాహనాలను సీజ్ చేయకూడదని గతంలోనే హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే, ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పోలీసులు ఇంకా వాహనాలను జప్తు చేస్తున్నారని ఒక బాధితుడు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం... రాష్ట్ర డీజీపీ, హోం శాఖ కార్యదర్శి, అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్ లకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాహనాలను ఎందుకు సీజ్ చేస్తున్నారో తెలపాలని, దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

అధికారుల వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను జూన్ 19వ తేదీకి వాయిదా వేసింది. పెండింగ్ చలానాల విషయంలో పోలీసులు కేవలం చట్టపరంగా జరిమానా వసూలు చేయాలి తప్ప, వాహనాన్ని స్వాధీనం చేసుకునే హక్కు లేదని ఈ పరిణామం ద్వారా మరోసారి స్పష్టమైంది.

## ఫోన్ ట్యాపింగ్, సింగర్ మంగ్లీకి సంబంధించిన కేసులపై స్పందించిన కొత్త డీజీపీ

**ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ చివరి దశకు చేరుకుందన్న సీవీ ఆనంద్**

**త్వరలో రెండో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేస్తామని వెల్లడి**

**తెలంగాణ పోలీసింగ్‌ను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని హామీ**




రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు విచారణ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే సిట్ రెండో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయనుందని తెలిపారు. ఈ కేసు ఎంత వరకు వచ్చిందో సమీక్ష జరిపిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు. సీవీ ఆనంద్ ఉదయం డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించారంటూ ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పోలీసింగ్‌ను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. విప్లవాత్మక మార్పులతో ఇప్పటికే తాము అగ్రస్థానంలో కొనసాగుతున్నామని, పోలీసింగ్ వ్యవస్థలో 'ఏఐ'ని తీసుకువస్తామని తెలిపారు. మహిళల భద్రత, చైల్డ్ అండ్ ఉమెన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ దందాపై దృష్టి సారిస్తామని అన్నారు.

పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుని, ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నక్సలైట్ల నిర్మూలనకు గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను సరైన రీతిలో ఉపయోగించుకుంటామని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను వివిధ రకాలుగా మోసం చేస్తున్నారని, అలాంటి నేరాలను అదుపు చేసేందుకు జిల్లాల వారీగా ఎస్పీలు కార్యాచరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సింగర్ మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసుపై కూడా డీజీపీ స్పందించారు. ఈ కేసుకు సంబంధించి తనకు పూర్తి సమాచారం లేదని తెలిపారు. ఈ కేసుపై సమీక్ష జరిపిన తర్వాత చెబుతానని అన్నారు.

## టీఆర్ఎస్ గూటికి మాజీ మంత్రి బోడ జనార్ధన్...



కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్ లోకి చేరికలు మొదలయ్యాయి. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ టీఆర్ఎస్ లో చేరనున్నారు. ఈరోజు బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో కవితతో జనార్ధన్ భేటీ అయ్యారు.

కవితతో భేటీ అనంతరం బోడ జనార్ధన్ మాట్లాడుతూ, త్వరలోనే తన అనుచరవర్గంతో కలిసి అధికారికంగా పార్టీలో చేరతానని వెల్లడించారు. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.బోడ జనార్ధన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా పేరుగాంచారు. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

# మెదక్ లో ప్రోటోకాల్ రచ్చ

**మెదక్, మే1,**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. ఇక 2014 నుంచి బీఆర్ఎస్ వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టింది. ప్రస్తుతం కారు పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి. కానీ.... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో....ఇక్కడ తరచూ ప్రోటోకాల్ వివాదాలు రేగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఇతర నియోజకవర్గాల్లో ఇలాంటి గొడవలు పెద్దగా లేకున్నా....నర్సాపూర్‌లో మాత్రం రచ్చో రచ్చస్య అన్నట్టుగా ఉంటోందట. రెండేళ్ల క్రితం అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా
ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ నియోజకవర్గంలో బడిబాట కార్యక్రమానికి వచ్చారు.అప్పుడు కాంగ్రెస్ ఇన్చార్జ్ రాజిరెడ్డికి స్కూల్ లో ఓ రూమ్‌కి రిబ్బన్ కట్‌చేసే అవకాశాన్ని మంత్రి సురేఖ ఇవ్వడాన్ని ఎమ్మెల్యే సునీత వ్యతిరేకించారు. ఎటువంటి ప్రోటోకాల్ లేని రాజిరెడ్డితో క్లాస్ రూమ్ ఎలా ఓపెనింగ్ చేయిస్తారన్నది ఎమ్మెల్యే అభ్యంతరం. ఆ సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఆ తర్వాత కూడా ప్రతి సందర్భంలో ఎక్కడో ఒకచోట ప్రోటోకాల్ రగడ నడుస్తూనే ఉంది. ఇక తాజాగా ఇన్చార్జ్ మంత్రి వివేక్ నర్సాపూర్ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం చినికి చినికి గాలి వానలా మారింది. నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్న ఎమ్మెల్యే వాదనతో రచ్చ జరిగింది. గతంలో ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశారామె. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలోనూ ప్రోటోకాల్ అంశంతో మొదలైన గొడవ చివరికి రాజకీయ విమర్శల వరకు వెళ్లింది. దీంతో ఇప్పుడు నియోజకవర్గంలోని అధికారులు ప్రభుత్వ

కార్యక్రమాలు నిర్వహించాలంటేనే హడలిపోతున్నారట.ఏ కార్యక్రమంలో ఏమవుతుందోనని ఆందోళన పెరుగుతోంది. మంత్రి వివేక్, ఎమ్మెల్యే సునీత వర్గాల మధ్య గొడవ జరిగినప్పుడు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ రంగంలోకి దిగి నేతలకు నచ్చజేప్పేందుకు యత్నించినా ఫలితం లేదంటే సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు పరిశీలకులు. అయితే ప్రోటోకాల్ సమస్యపై ఎమ్మెల్యే సునీత చేస్తున్న పోరాటం కరెక్టేనన్నది బీఆర్ఎస్ వెర్షన్. కానీ... కాంగ్రెస్ నాయకులు మాత్రం ఎమ్మెల్యే వైఖరిని తప్పుపడుతున్నారు. మంత్రి మాట్లాడుతుంటే... మధ్యలో ఓ ప్రజాప్రతినిధి కలగజేసుకుని కార్యక్రమాన్ని డిస్టర్బ్ చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు అధికార పార్టీ నాయకులు. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి ఎమ్మెల్యే ఇచ్చే గౌరవం ఇదేనా అని కౌంటర్ ఇస్తున్నారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే సమయంలో తాము ఏమీ అనలేదని...ఆమె అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తుంటే అంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏముందన్నది కాంగ్రెస్ వాదన.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో... ఎంత మాత్రం ప్రోటోకాల్ పాటించారో... సునీతా లక్ష్మారెడ్డి ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే మంచిదన్నది కాంగ్రెస్ వెర్షన్. నర్సాపూర్ నియోజకవర్గంలో పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగైన
స్థానాలు సాధించడం, ఎమ్మెల్యే స్వగ్రామం గోమారంలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థే సర్పంచ్ గా గెలవడం, మున్సిపల్ ఎన్నికల్లోనూ నర్సాపూర్ మున్సిపాలిటీని అధికార పార్టీ కైవసం చేసుకోవడంతో ఎమ్మెల్యే సునీత ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ ప్రచారం చేస్తోంది కాంగ్రెస్. తాను కాంగ్రెస్‌ను వీడిన తర్వాత బలహీనంగా కనిపించిన పార్టీ క్యాడర్... ఆవుల రాజిరెడ్డి రాక తర్వాత బలపడటాన్ని ఆమె జీర్ణించుకలేకపోతోందంటూ ప్రచారం చేసుకుంటున్నారు హస్తం నేతలు. నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కంటే అధికారులు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డికే ప్రాధాన్యం ఇస్తున్నారట. ఈ పరిస్థితుల్లో ప్రోటోకాల్ రచ్చ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదని అంటున్నారు పరిశీలకులు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం మంత్రులు వచ్చిన ప్రతిసారి గొడవ జరగడం కామన్ అయిపోతోంది. దీంతో...అఫీషియల్ ప్రోగ్రామ్స్ అంటేనే హడలిపోతున్నారట ప్రభుత్వ అధికారుల

# నష్టనివారణ చర్యల్లో మంగ్లీ

**హైదరాబాద్ ,మే1,**
సింగర్ మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు ప్రకంపనలు రేపుతూనే ఉంది. బాధితులు రోడ్డెక్కుతుండటం, బాధితుల తరపున గిరిజన సంఘాల నేతలు పోరాటం చేస్తుండటం మరింత హీట్ పెంచుతోంది. అయితే.. తనపై వస్తున్న ఆరోపణలపై మంగ్లీ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. మైక్రో ఫైనాన్స్ బాధితులకు అన్యాయం జరిగిందన్న మంగ్లీ..బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ప్రకటించారు. కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని.. ఈ ఆర్థిక మోసంలో తనకుఎ ఎలాంటి ప్రమేయం లేదని చెప్పుకొచ్చారు.. ఈ సమయంలోనే.. తనపై పెట్టిన కేసుపై మరోసారి మంగ్లీ స్పందించారు. రమావత్ మధుపై విరుచుకుపడిన సింగర్ మంగ్లీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దుర్మార్గుడు అని తెలియక మాట్లాడిన పాపానికి.. పట్టుబడితే నా బ్యాండ్‌తో కలిసి ఇంటికెళ్లి భోజనం చేశానన్నారు. ఒకపూట భోజనం చేసిన పాపానికి క్షోభ అనుభవిస్తున్నా.. అంటూ పేర్కొన్నారు.కొందరు కావాలనే ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని మంగ్లీ పేర్కొన్నారు. ఏ ఆధారాలు లేకుండా తన చుట్టూ కుట్రలు పన్నుతున్నారని.. రమావత్ మధు చేసిన మోసాల్లో తనకు 1శాతంకూడా సంబంధం లేదన్నారు. ప్రజల్ని మోసం చేసి రక్తపు కూడు తినే మనిషిని కాదన్నారు. తన కుటుంబ సభ్యులకూ ఈ మోసంతో సంబంధం లేదన్నారు. బండి శివ పేరుని తన తమ్ముడు శివచౌహాన్‌గా ప్రచారం చేస్తున్నారన్నారు. పదే పదే అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలనుకుంటున్నారని.. తాను.. తన కుటుంబ సభ్యులు ఎక్కడికీ పారిపోలేదని పేర్కొన్నారు. అంతిమంగా నిజమే గెలుస్తుంది అంటూ మంగ్లీ నోట్ విడుదల చేశారు.ఇటీవల ఈ ఫ్రాడ్ కేసు బాధితుడు నల్గొండ జిల్లా పెద్దవూరకు చెందిన పాల్తి రమేష్ అనే వ్యక్తి ఆత్మహత్యకు



పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మంగ్లీ నోట్ విడుదల చేసింది. రమావత్ మధు బాధితుడిగా అభివర్ణిస్తూ మంగ్లీ తాను విడుదల చేసి నోట్‌లో రాసుకొచ్చింది. ఆయన మృతి బాధాకరమని చెబుతోంది మంగ్లీమరోవైపు మైక్రో ఫైనాన్స్ స్కామ్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు మంగ్లీ సోదరుడు శివ చౌహాన్.. మంగ్లీపై కుట్రపూరితంగానే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అడ్వొకేట్ సుబ్బారావు ఆరోపణలు నిరాధారమన్నారు. ఈ కేసులో వాస్తవాలు ఏంటనేది పోలీసు విచారణలో తేలుతాయన్నారు.
తమపై నిరాధార ఆరోపణలు చేసిన వాళ్లకు చట్టపరంగానే సమాధానమిస్తామని అంటున్నారు మంగ్లీ సోదరుడు శివ చౌహాన్..

# తెలంగాణపై బీజేపీ నజర్



**హైదరాబాద్ ,మే1,**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయేఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.ఈ ఏడాది జరగనున్న జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో అనూహ్య రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికి
పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం
సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగాణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది.కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రమని బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి,
కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు.మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'జానగ్రహ సభ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకుకమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు పారుతుందో వేచి చూడాలి.

## లీస్ట్, లాస్ట్ హైదరాబాదే...

**హైదరాబాద్ ,మే1, :** తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో రాజధాని హైదరాబాద్ జిల్లా తన ఉనికిని కోల్పోయి చిట్టచివరి స్థానానికి పడిపోయింది. బుధవారం విడుదలైన ఫలితాల ప్రకారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాలు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయాయి. గతేడాది 30వ స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా, ఈసారి మరో మూడు స్థానాలు దిగజారి 33వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. రంగారెడ్డి జిల్లా 31 నుంచి
30వ స్థానానికి చేరుకోగా, మేడ్చల్ జిల్లా మాత్రం 28 నుంచి 24వ స్థానానికి మెరుగుపడి కొంత పరువు దక్కించుకుంది. హైదరాబాద్‌ను టాప్ టెన్ జాబితాలోకి తెస్తామన్న విద్యాశాఖ అధికారుల ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వస్తున్నాయిఈ ఏడాది ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుండి మొత్తం 1.76 లక్షల మంది పరీక్షలు రాయగా, అధిక సంఖ్యలో బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 96 శాతానికి పైగా విద్యార్థినులు పాస్ అవ్వగా, రంగారెడ్డిలో 94.78 శాతం, హైదరాబాద్‌లో 91.40 శాతం మంది విద్యార్థినులు విజయం సాధించారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మెరుగైనప్పటికీ, ఇతర జిల్లాలతో పోటీ పడటంలో ఇక్కడి విద్యార్థులు వెనుకబడ్డారు. రాజ్‌భవన్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు.జిల్లాల వారీగా 2026 ఫలితాలను పరిశీలిస్తే, మేడ్చల్ జిల్లా 95.24 శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానంలో నిలిచింది.
రంగారెడ్డి జిల్లా 92.96 శాతంతో 30వ స్థానంలో ఉండగా, హైదరాబాద్ జిల్లా 89.23 శాతంతో 33వ స్థానానికి పరిమితమైంది. విద్యా సంవత్సరం ప్రారంభం నుండి విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ లోపించడం, కేవలం సమీక్షలకే పరిమితమవ్వడం వల్ల ఈ దారుణ ఫలితాలు
వచ్చాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు విద్యాశాఖలో అక్రమ బదిలీలు, సిఫార్సుల ప్రభావం కూడా ఫలితాలపై పడిందని తెలుస్తోంది. కొంతమంది ఉపాధ్యాయులు రాజకీయ సిఫార్సులతో నగరంలోని ఉన్నత పాఠశాలలకు బదిలీపై వచ్చి, బోధన కంటే ఇతర అంశాలపైనే దృష్టి సారించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా హాజరు కాకపోయినా అధికారులు పట్టించుకోలేదని, ప్రైవేటు పాఠశాలలపై ఉన్న ఆసక్తిని ప్రభుత్వ బడులపై చూపడం లేదని ఫలితాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## కమలంలో ఆగని కుమ్ములాటలు

**కరీంనగర్ ,మే1, :** తెలంగాణ బీజేపీ నేతల తీరును సొంత పార్టీ కేడరే ఎండగడుతోంది. వ్యక్తిగతంగా వాళ్ళకు అక్కడ పదవులతో పని లేకున్నా... పార్టీని అధికారంలో నిలపాలన్న తాపత్రయంతో పెద్దోళ్ళంతా అలా కష్టపడుతున్నారు. కానీ.... ఇక్కడ తెలంగాణలో పార్టీని నిలిపి గెలిపిస్తే... ముఖ్యమంత్రి నుంచి మంత్రి పదవుల దాకా... వీళ్ళకే కదా... వస్తాయి, అయినా సరే... రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు నిర్లిప్తంగా ఉంటున్నారు, కనీస యాక్టివిటీ కూడా ఎందుకు ఉండటం లేదని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో చర్చ జరుగుతోంది. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఇక్కడ పార్టీని గెలిపిస్తే... తమకు పదవులు వస్తాయని తెలిసి కూడా ఇగోకి పోతూ... ఉన్న అవాకాశాలను కూడా ఉపయోగించుకోవడం లేదని అంటున్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా... కమలంలోని పెద్దలు అక్కడ వాలిపోతారు.గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తారు. అక్కడి కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తారు. ఆ రూపంలో పార్టీకి ఊపు వస్తుంది. ప్రస్తుతం
పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జరుగుతోంది కూడా ఇదే. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా...బెంగాల్‌లో గెలుపును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటేచెప్పులరిగేలా తీరుగుతున్నారని చెప్పుకోవచ్చు. బీజేపీకి చెందిన మిగతా అగ్ర నాయకులు కూడా అదే స్థాయి ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఈ పాయింట్‌నే లేవనెత్తుతూ తెలంగాణ బీజేపీ నాయకులు వాళ్లని చూసి ఎప్పుడు నేర్చుకుంటారంటూ డిస్కస్ చేసుకుంటున్నారు కింది స్థాయిలో. బెంగాల్‌లో గెలిస్తే...పార్టీ ఖాతాలోకి మరో రాష్ట్రం వస్తుంది. అంతే తప్ప... నేషనల్ లీడర్స్ అందరికీ అక్కడేం పదవులు రావు, ప్రత్యేకంగా ఒరిగేదేం లేదు. అయినా సరే వాళ్ళంతా అంత కష్టపడుతుంటే... ఇక్కడ మాత్రం ముఖ్యమంత్రి పీఠం సహా... రకరకాల పదవులు రాష్ట్ర నేతలకే దక్కే అవకాశం ఉన్నా... ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారంటూ ఫైరైపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో పాగా వేయాలని పెద్దవాళ్ళు పడుతున్న తాపత్రయం... తిరుగుతున్న తీరు... తెలంగాణ నేతలకు కనిపించడం లేదా అన్న ప్రశ్న వస్తోంది కేడర్ నుంచి. వాళ్లని చూసైనా.... మా నాయకులు ఇగోలు పక్కన పెట్టాలని అంటున్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్న నేషనల్ లీడర్స్‌కు, పార్టీ కన్నా మేమే గొప్ప అనుకుంటున్న స్టేట్ టనాయకులకు చాలా తేడా ఉందని, ఆ సంగతి గమనించుకుని ఇకనైనా రాష్ట్ర పార్టీ నాయకులు మారితేనే తెలంగాణలో వాళ్ళకైనా, పార్టీకైనా భవిష్యత్ అన్నది కార్యకర్తల మాట. క్షేత్ర స్థాయిలో పని చేయడానికి
మేం సిద్ధంగా ఉన్నా...నడిపించడానికి వాళ్లు రెడీగా లేరు, ఆ ఇగోలతో ఎన్నాళ్లని నడిపిస్తారని సొంతోళ్ళే మాట్లాడుకుంటున్నారు. మారండయ్యా..... ఇకనైనా మారిపోండయ్యా..... పై వాళ్ళని చూసి నేర్చుకోండయ్యా..... అంటున్న తెలంగాణ బీజేపీ కార్యకర్తల మాటను రాష్ట్ర నాయకులు ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటారో చూడాలి.

## వలస నేతలే దిక్కా

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో ఇప్పుడు వలస నేతల హవానే నడుస్తోంది. ఎక్కడ చూసినా వాళ్ళే కనిపిస్తున్నారు. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి నుంచి మొదలు.. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి.. ఇలా ఒకరేమిటి...జిల్లాలో పొలిటికల్ హేమా హేమీలని చెప్పుకునే వాళ్ళలో ఎక్కువ మంది ఇప్పుడు హస్తం గూటికే చేరారు. వాళు పార్టీ మారడం సంగతి ఎలా ఉన్నా... ఆ తర్వాతే అసలు చిక్కులు మొదలయ్యాయట. నాయకుల వెనకే వచ్చిన అనుచరుల పరిస్థితి ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉన్నట్టయిందని అంటున్నారు. పార్టీ జిల్లా, డివిజన్, వార్డు కమిటీల్లో తమ వారికి పదవులు ఇప్పించుకుందామంటే... పీసీసీ పెట్టిన త్రీ ఇయర్స్ రూల్ ప్రతిబంధకంగా మారింది. పార్టీలో కనీసం మూడేళ్లు పనిచేస్తేనే పదవి ఇవ్వాలన్నది రూల్. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కుఅధిష్టానం నుంచి ఉన్న క్లియర్ కట్ లైన్ ఇది. 2023 ఎన్నికల కంటే ముందు నుంచి ఎవరైతే పార్టీని నమ్ముకుని ఉన్నారో, వారికే ప్రస్తుత కమిటీల్లో చోటు కల్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జంపింగ్ జపాంగ్‌లకు పార్టీలోకి వచ్చిన వెంటనే పదవులు ఇస్తే.. మొదటి నుంచి కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతుందని భావిస్తోంది అధిష్టానం.దీంతో ఏళ్ల తరబడి జెండా మోసిన పాత కాపులు ఖుషీ అవుతుంటే.. వలస నేతల కేడర్‌లో మాత్రం నిరాశ పెరుగుతోందట. పదవులు లేకపోతే పార్టీలో మా ఉనికి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. మహిళా నేతల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలిసింది.

## భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి కళ్యాణం..

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, ఎల్‌బీనగర్, మే 01 న్యూస్ ఇండియా ప్రతినిధి::** చైతన్యపురి డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ (కోసగుండ్ల) ఫణిగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీ నరసింహస్వామి జయంతి--కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ ఉత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ దేవస్థాన అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీహరి, రత్నాకర్ రెడ్డి, ప్రభు, రామారావు, గణేష్, నాగరాజు, మహేష్, రాకేష్, జలంధర్, నరేశ్, శ్రీధర్ తదితరులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పోచారంలో ఘనంగా నరసింహస్వామి కళ్యాణం..

- స్వామివారి సేవలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, మే 01 న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఈ ఉత్సవానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బాల భరోసా కార్యక్రమం




**న్యూస్ ఇండియా :నర్సంపేట :**వరంగల్ జిల్లా నర్సంపేటపట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం నర్సంపేట సివిల్ ఆసుపత్రిలో బాల భరోసా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి"సిడిపిఓ" మధురిమ అధ్యక్షతన వహించారు.ఇట్టి కార్యక్రమంలో భాగంగా పీడియాట్రిక్ విభాగాధిపతి డా. ప్రతాప్ లోప పోషణ మరియు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 25 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల తల్లులకు అవసరమైన సూచనలు అందించి, మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ.. ఆర్ బిఎస్ కె.ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి ఎంజైమ్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నప్పటికీ, తల్లిదండ్రులు అక్కడికి తీసుకువెళ్లడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని తెలిపారు.అందువల్ల నర్సంపేట జిల్లా ఆసుపత్రిలోనే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ యంఓ డా. కళ్యాణి, నర్సింగ్ ఆఫీసర్ శోభారాణి, ఏఎన్ యంఎస్ కవిత,శోభ, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు,అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో నూతన పోరాటాలకు సిద్ధం కావాలి





- చికాగో వీరుల త్యాగఫలం కార్మిక వర్గానికి దిక్సూచి
- ఎనిమిది గంటల పనిదినం కోసం సాగిన పోరాటం అజరామరం
- ప్రస్తుత పాలకులు కార్మిక చట్టాలను కాలరాస్తున్నారు
- 44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చడం శ్రమశక్తిని దోచుకోవడమే
- కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను కాపాడుకోవాలి
- కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దేశ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా 141వ మేడే 723 కేంద్రాల్లో ఎర్రజెండా రెపరెపలు

**కొత్తగూడెం( న్యూస్ ఇండియా ప్రతినిధి)మే 1:**చికాగో వీరుల త్యాగఫలం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అని, నాడు ఎనిమిది గంటల పనిదినం కోసం ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తితో హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలు సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం 141వ మేడే ఉత్సవాలు శుక్రవారం సిపిఐ, ఏఐటీయూసీ, అనుబంధ ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ప్రధాన కూడళ్లు, హమాలీ అడ్డలు, ఆటో స్టాండ్‌లు, భవన నిర్మాణ కార్మిక క్షేత్రాలు, యూనియన్, పార్టీ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సాబీర్ పాషా ఎర్రజెండాను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్లో నిర్వహించిన భారీ ప్రదర్శన నిర్వహించారు. జెండావిష్కరణల అనంతరం జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దేశ ప్రయోజనాలకు విఘాతమని, ఈ దుర్మార్గపు విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. మేడే స్ఫూర్తితో అన్యాయమైన విధానాలను ఎదిరించి, పని భద్రత, కనీస వేతనాల సాధన కోసం మరో పోరాట దశకు కార్మిక వర్గం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా వ్యాపితంగా 723 కేంద్రాల్లో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించి చికాగో అమరవీరుల త్యాగాలు గుర్తుచేసుకున్నామని, కార్మికవర్గ పోరాటాలకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, ఎస్ కె ఫహీమ్, కె రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, రాంచందర్, పోలమూరి శ్రీనివాస్, భాగం మాధవరావు, యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, ధనలక్ష్మి, కూరపాటి సుధాకర్, ధర్మరాజు, జహీర్, షాహీన్, మద్దాల హరిత, దాసరి శ్రీనివాస్, అస్మత్, ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 12వ రోజుకు చేరిన భద్రకాళి. భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు



**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత పన్నెండు రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహింపబడుతున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ రోజు చక్రతీర్థోత్సవం (చక్రస్నానం), ధ్వజ అవరోహణం, ఘటాభిషేకం పుష్పయాగంతో సుసంపన్నమయ్యాయి. అమ్మవారికి ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం పూర్తిచేసిన తర్వాత స్నపనవిధి విశేష పూజాదికములు నిర్వహించి, పూర్ణాహుతి నిర్వహించిన పిమ్మట అమ్మవారికి చూర్ణోత్సవం జరిపారు. ఈ రోజు సువాసినీమణులు (ముత్తయిదువలు) అందరూ కలసి జరిపిన చూర్ణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అమ్మవారి అభిషేకానికి పసుపుకొమ్ములు, సుగంధ ద్రవ్యాలు అన్నీ ఒకచోట చేర్చి తిరగలిలో వేసి ముత్తయిదువలు విసిరి అమ్మవారికి ఒక పాత్రలో సమర్పించారు. ఈ చూర్ణాన్నే చక్రతీర్ణోత్సవంలో మరియు అమ్మవారికి నలుగు పిండిగా ఉపయోగించి స్నపనం జరుపుతారు. చక్రతీర్థోత్సవం (చక్రస్నానం) ముఖ్య అర్చకులు శ్రీ వెంకటనాగరాజ శర్మ నేతృత్వంలో శ్రీ వేముగంటి సుధాకర్ శర్మ ద్వారా వైభవంగా నిర్వహింపబడింది. దర్శించిన భక్తులు ఒక దివ్యానుభూతికి లోనయి ఆనంద పరవశులయ్యారు. అనంతరం భేరీతాడనం జరిపి ధ్వజావరోహణం చేశారు. బ్రహ్మోత్సవ నిర్వహణలో అధికారుల, అర్చకుల, భక్తులు లేదా తదితరులెవ్వరివల్లనైనా జ్ఞాతాజ్ఞాతంగా జరిగిన పొరపాట్లు లేదా న్యూనాతరిక్త దోషాలవల్ల సంక్రమించే పాపం తొలగిపోయి బ్రహ్మోత్సవ సంపూర్ణ సాంగత్యం కలిగి భక్తులందరికీ శుభాలు ప్రాప్తింపజేయడానికి శాస్త్రంలో చెప్పబడిన ప్రకారం అమ్మవారికి శతఘటాభిషేకం జరిపి రాత్రి పుష్పయాగం నిర్వహించారు. పుష్పయాగంలో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. శాస్త్రంలో చెప్పబడిన మేరకు పుష్పయాగంలో అమ్మవారికి అర్చకులు పదిసార్లు జరిపిన దశార్చనారాధన భక్తులకు అనిర్వచనీయమైన అనుభూతిని ప్రసాదించింది.

ఈ రోజు ఉదయం దేవాలయములో అమ్మవారి ఊరేగింపు నిమిత్తము తన సొంత ద్రవ్యం కోటి రూపాయల వ్యయంతో వరంగల్ పశ్చిమ ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ఈరోజు అడ్వాన్సుగా 45 లక్షల రూపాయలు చెల్లించి ముప్పయి అడుగుల రథం తయారీకి మహారాష్ట్ర నాగపూర్ నుండి తెప్పించిన మేలు రకం టేకు కలపతో శిల్పి గిర్మాజి ప్రవీణ్ చారి ఆధ్వర్యంలో రథం తయారీకి దేవాలయ చైర్మన్ డా॥ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు శ్రీయుతులు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, జారతి వెంకటేశ్వర్లు, బింగి సతీష్, పాలడుగుల ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్, మూగా శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీత మరియు ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూజలు నిర్వహించి పని ప్రారంభించారు.

ఆలయ సహాయ కమీషనర్ ఒ ఈ.ఓ శ్రీమతి రామల సునీత మాట్లాడుతూ శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికార, అనధికార ప్రముఖులు, దాతలు, భక్తులు, కులసంఘాలు ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా వారికి ధన్యవాదాలు తెలిపారు.


## శ్రీమతి కొండా సురేఖ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ



**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)**
వ్యవసాయ మార్కెట్ కమిటీ వరంగల్
తేదీ .01.05.2026 రోజున లక్ష్మి పురం కూరగాయల మార్కెట్ నందు కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా గౌరవనీయులు శ్రీమతి కొండా సురేఖ అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి చే జెండా ఆవిష్కరణ గావించబడినది. ఇట్టి కార్యక్రమంలో హమాలీ యూనియన్ వారి వినతి మేరకు కూరగాయల మార్కెట్ నందు హమాలీ కొరకు భవనము ఏర్పాటు, మార్కెట్ కమిటీచే పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రమాదబీమా పాలసీ (అఅంబతీఖఅఎవ)చెల్లింపు మరియు హమాలీ వారి ఆరోగ్య దృష్ట్యా ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయుటకు తగిన స్థలం చూసి ఏర్పాటు చేస్తామని మంత్రి కొండా సురేఖ హామీ ఇవ్వడం జరిగినది.

ఇట్టి కార్యక్రమం నందు డా. సత్య శారదా జిల్లా కలెక్టర్ వరంగల్ , మంత్రి. కొండా సురేఖ జిల్లా మార్కెటింగ్ అధికారి వరంగల్ జి మల్లేశం ఉన్నత శ్రేణి కార్యదర్శి వరంగల్ మరియు ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు, హమాలీ మరియు గుమస్తా సంఘం కార్మిక సోదరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్యుడిగా డా:రామచంద్ అభినందించిన :జిల్లా కలెక్టర్



**న్యూస్ ఇండియా నర్సంపేట :** ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట అమీనాబాద్ గ్రామానికి చెందిన డా:ధరవత్ రామచంద్ మే డే సందర్భంగా ఉత్తమ వైద్యునిగా జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా అవార్డు పొందారు.డా: రామచంద్ సేవలలో ఎటువంటి లోపాలు లేకుండా క్రమశిక్షణతో వైద్య సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడంపై తమ వైద్య సిబ్బందితోపాటు పలు ముఖ్యులు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తపరిచారు.

## SI వెంకటేష్ గౌడ్ ని సన్మానించిన బి ఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు




**న్యూస్ ఇండియా పెబ్బేర్:**లింగాల పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై పెబ్బేరు పోలీస్ స్టేషన్ కి వచ్చిన వెంకటేష్ గౌడ్ ని దీ=మాపార్టీ అధ్యక్షులు వి.దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అందరు కలిసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది

అందరు కలిసి స్వీట్స్ తినిపించడం జరిగింది. శాంతి భద్రతలను కాపాడాలని, నిస్పక్ష పాతంగా పని చేయాలని,అత్యంత నిబద్ధతతో, సమర్ధతతో, శ్రద్ధతో విధులు నిర్వర్తించి జిల్లా పోలీసు వ్యవస్థకు విశేష సేవలు అందించాలని, భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో, విజయవంతమైన సేవలు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాము అని తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో ఎద్దుల సాయినాథ్, శేఖర్ గౌడ్ ,సాయిరెడ్డి ,రామన్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, ఎం రాములు, వసంత్, గోవర్ధన్ రెడ్డి ,సిద్ధిరాములు, మహేష్, బీసన్న, వెంకటేష్ ,కుమ్మరి సురేష్, బిందెల హనుమంతు, శేఖర్ ఆచారి, వెంకటరెడ్డి ,షేకుల శీను, పర్వతాలు,మోతే హనుమంతు ,సురేష్ ,కరణ్ తదితరులు పాల్గొన్నారు

# మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్లో మే డే వేడుకలు





**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 1( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే)ను ఘనంగా నిర్వహించారు.సమాజ నిర్మాణంలో కార్మికుల అపారమైన సేవలను స్మరించుకుంటూ, వారి కృషికి గౌరవం తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఉ జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మనూ చౌదరి, ఐ.ఏ.ఎస్., ఈ సందర్భంగా కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్., అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కూడా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కృషి దేశ ఆర్థికాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పనివాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్మిక సంక్షేమం కోసం జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, కార్మిక సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడం, కార్మికుల జీవిత స్థితిగతులను మెరుగుపరచడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అంజనేయులు,ఈఎస్ఐ విభాగానికి చెందిన డా. కనక దుర్గాదేవి, ఐటీఐ మెడ్చల్ ప్రిన్సిపాల్ హనుమా నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్ రెడ్డి ని ప్రశంసిస్తూ సత్కరించారు. అదనంగా, బాల కార్మికత్వం నుండి రక్షించబడిన మరియు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న కుమారి మీనా ను "బెస్ట్ చైల్డ్ సర్వైవర్"గా గుర్తించి సత్కరించారు. ఆమె పట్టుదల మరియు విద్యపై ఆసక్తిని అధికారులు అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం నుండి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లక్ష్మీపతి కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ శ్రీమతి రాధిక నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సాయి సుమన్ పి. మరియు అంజనేయులు కార్మికులకు కొత్త కార్మిక చట్టాలు (లేబర్ కోడ్స్) మరియు ఉద్యోగుల హక్కుల గురించి వివరణ ఇచ్చారు. వారు కార్మికులు తమ హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో కార్మికులకు అవగాహన కల్పించేందుకు మే 02 నుండి మే 10 వరకు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో కార్మిక చట్టాలు, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించబడుతుంది.

## ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం..

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..
- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పణ..
- ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం..



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్, మే 01, న్యూస్ ఇండియా ప్రతినిధి:**ఇబ్రహీంపట్నంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం రాత్రి మున్సిపల్ కేంద్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈవో దేవరశెట్టి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, భక్తబృందం సహకారంతో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కార్యక్రమం ఘనంగా సాగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… ఇబ్రహీంపట్నంలోని ఈ స్వయంభూ క్షేత్రం మహిమగలదని, భక్తుల కోరికలను తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతోందని పేర్కొన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారని తెలిపారు. కళ్యాణోత్సవం నిర్వహణ విషయాన్ని భక్తబృందం తన దృష్టికి తీసుకురాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి, ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణకు దేవాదాయ శాఖకు ఆదేశాలు జారీ చేయించినట్లు చెప్పారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. తాను నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి దేవాలయం త్వరలో ప్రారంభమై 'కలియుగ వైకుంఠం'గా భక్తులను ఆకర్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల భాస్కర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఆలయ భక్తబృందం, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## కార్మికవర్గ పోరాటాలను బలోపేతం చేయాలి

- 140 వ మేడే సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ పిఒడబ్ల్యు(విముక్తి) పెర్క సునీత



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 1 (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )**
అమెరికన్ పెట్టుబడిదారీ ప్రభుత్వ పోలీసు తూటాలకు రక్తం చిందించిన చికాగో పోరాట కార్మిక అమరవీరుల సాక్షిగా భారతదేశంలో దోపిడీ, పీడన, అణిచివేతలకు వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటాలను భలోపేతం చేయాలని సిపిఐ (ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ ప్రగతిశీల మహిళాసంఘం (పిఒడబ్ల్యు(విముక్తి)) సెంట్రల్ కమిటీ కార్యదర్శి పెర్క సునీత పిలుపునిచ్చారు. 2026, మే-1, శుక్రవారం రోజు మేడ్చల్, కాప్రా, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల వికలాంగుల కాలనీలో కవి, కళాకారుడు మేడశీను అధ్యక్షతన 140 వ మేడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చికాగో పోరాట అమరుల చిహ్నమైన అరుణపతాకాన్ని పెర్క సునీత ఆవిష్కరిస్తూ, విప్లవ నివాళులు అర్పించారు. ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కమిటీ మే-1 నుండి 7 వరకు గ్రామ, పట్టణ, బస్తీ, పారిశ్రామిక ప్రాంతాల్లో మేడేను ఘనంగా నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా జరిగిన కార్యక్రమంలో రంగం అంజినేయులు, గోపాల్, తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మరాణి తదితరులు పాల్గొన్నవారిలో ఉన్నారు.

## వెంకటాపూర్ గ్రామంలో ఘనంగా మేడే కార్మిక దినోత్సవం

**న్యూస్ ఇండియా శ్రీరంగాపూర్ :**శ్రీరంగాపూర్ మండల్ వెంకటాపూర్ గ్రామంలో మే డే కార్మికుల దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది కార్మికుల దినోత్సవం ఇది శ్రమజీవుల కార్మికుల త్యాగాలను పోరాటాలను వారి ఐక్యతను గుర్తు చేసుకుని రోజు 1886లో అమెరికాలోని చికాగోలో కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం చేసిన పోరాటమే దీనికి పునాది మన భారతదేశంలో మే డే 1923లో చైనాలో జరుపుకున్నారు మేడే దినోత్సవం ను చాలా దేశాలలో ప్రభుత్వ సిలువదినంగా తీసుకోవడం జరిగింది మే డే అంటే రక్షించండి అని అర్థం ఇది విమానాలు లేదా నౌకలలో అత్యవసర సమయంలో ఉపయోగించే పదం దీన్ని సాధారణంగా మే 1న జరుపుకునేది కార్మిక దినోత్సవం ఇందులో భాగంగా గ్రామం ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుర గౌని భారతి ఎల్లా గౌడ్ ఉప సర్పంచ్ సామేలు వార్డు మెంబర్లు మాజీ సర్పంచులు మాజీ వాడు మెంబర్లు కార్మికులు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలో మేడే సందర్భంగా ఎగిరిన ఎర్రజెండాలు.......



**కుత్బుల్లాపూర్ మే 1 (న్యూస్ ఇండియా ప్రతినిధి )**
141 వ మే డే సందర్భంగా నేడు కుత్బుల్లాపూర్ మండలంలోని అన్ని ప్రాంతాలలో సిపిఐ మరియు ఏఐటియుసి ఆధ్వర్యంలో అరుణ పతాకని మే డే ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.
లెనిన్ నగర్,శ్రీనివాస్ నగర్, మక్దుమ్నగర్,బీరప్ప నగర్, అంజయ్య నగర్, జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్, రాజీవ్ గృహకల్ప, రాంకీ, గుబురు గుట్ట, గిరీనగర్,గాంధీ నగర్,రంగారెడ్డి నగర్, ఐడిపిఎల్ ఆటో స్టాండ్,ఈఎస్ఐ హాస్పిటల్, షాపూర్ నగర్ హమాలీ అడ్డ, షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వరరావు భవన్, ప్రీమియర్ కంపెనీ, కేకులే,సత్య ఫ్యాబ్రికేషన్, తదితర ప్రాంతాలలో మేడే సందర్భంగా ఎర్రజెండాలను ఎగురవేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పాల్గొని ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని రోజురోజుకు పెరుగుతున్న ధరలు నిరుద్యోగం సమస్యల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం కమ్యూనిస్టు పార్టీ నేనని భావిస్తూ కమ్యూనిస్టు పార్టీ వైపు చూస్తున్నారని దానికి అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మరియు ఏఐటియుసి నాయకత్వం పనిచేయాలని అప్పుడు మనం కోరుకునే సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. మే డే సందర్భంగా చికాగొ అమరవీరుల స్ఫూర్తిని ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న సందర్భంలో మరోసారి కార్మికులంతా ఏకమై కార్మిక రాజ్యం కోసం పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమాలకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ రావు నాయకత్వం వహించగా ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడి ఉత్తేజ నింపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసురత్నం, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షు లు ప్రవీణ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాబు భాస్కర్ కృష్ణ, యువజన సమైక్య అధ్యక్షులు సంతోష్ రెడ్డి, నాయకులు సదానంద్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, వీరస్వామి, సంతోష్, సుధాకర్,సహదేవరెడ్డి, సామెల్, ముసలయ్య, కీర్తి,నరసింహ రెడ్డి,సుంగిరెడ్డి, శ్రీనివాస్,సామెల్,ముసలయ్య, నరసయ్య, మధు, రాజు, ఇమామ్, యాదగిరి, జావేద్,జహంగీర్, ఆదిల్, చందు, పూర్ణచందర్, యాదగిరి,ప్రకాష్, దుర్గాప్రసాద్, భీమేష్, బక్కరి, మల్లేష్, శ్రీనివాస్, మజ్జి గౌరీ,రమేష్,కృష్ణ కమలమ్మ చంద్రావతి జ్యోతి లతోపాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ డిపోలో ఘనంగా మే డే వేడుకలు



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 1 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )**అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని కుషాయిగూడ డిపోలో ఘనంగా నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిథిగా వచ్చేసింది వెంకన్న గౌడ్ జండా ఆవిష్కరించి కార్మికుల దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మేడే ఒక తేదీ కాదు..కేవలం జ్ఞాపకం కూడా కాదు.కార్మిక శక్తి చరిత్రను కదిలించిన రోజు. కష్టజీవులు తమ ఆవేశాన్ని పోరాటంగా మార్చుకున్న రోజు హద్దులు లేని శ్రమ దోపిడీలో నలిగిన జీవితాలు.. చికాగో వీధుల్లో హక్కుల పతాకాలై కవాతు చేశాయి. హే మార్కెట్ సాక్షిగా ఎనిమిది గంటల పనిని నెత్తుటితో లిఖించాయి. "మేం బానిసలం కాదు" అంటూ పెట్టుబడి గుండెల్లో గునపాలు దించాయి.ఆ రణనినాదం ఆ ఒక్క రోజుకే పరిమితం కాలేదు. హే మార్కెట్ ఘటన అక్కడితో ముగియలేదు. అక్కడే మొదలయ్యింది.కాలాన్ని దాటి, ఖండాలను దాటి విశ్వమంతటికీ ప్రవహించింది. కార్మికోద్యమ ప్రస్థానంలో కాంతిరేఖగా వెలిగింది. ఆ వెలుగులో కార్మిక హక్కులు అంతర్జాతీయ చర్చల కేంద్రంగా మారాయి.ఎనిమిది గంటల పనివిధానం ప్రపంచ కార్మిక వర్గం సాధించిన ప్రాథమిక హక్కుగా స్థిరపడింది. వేతనాలకు చట్టబద్ధత వచ్చింది. ఇవి ఎవరో ఇచ్చిన వరాలు కావు. పోరాడి సాధించుకున్న విజయాలు. అయితే చరిత్ర ఎప్పుడూ ఒకే దిశలో నడవదు. ప్రపంచం మారుతోంది.అత్యంత వేగంగా, అసమానంగా, కొన్నిసార్లు నిర్దాక్షిణ్యంగా. ఈ యొక్క కార్యక్రమంలో ముత్యం వెంకన్న యుగేందర్ రెడ్డి డిపో సెక్రటరీ, రత్నం అధ్యక్షులు,రాజు, దాసు, లావణ్య, కృష్ణయ్య, యాదయ్య, రాజ్ కుమార్, వెంకటేష్ రఘుపల్ రెడ్డి, శ్రీనివాస్,.జ్యానేశ్వర్, చంద్రశేఖర్, ఖాసీం, ప్రదీప్ కుమార్, సిద్దులు, కేశవ్, బిక్షపతి, నాగేష్,బాలకృష్ణ, శ్రీనివాస్, బిచ్చమ్, సుగుణకర్ బాలనర్సన్న, జంగయ్య మెకానికులు డ్రైవర్లు కండక్టర్లు అధికంగా పాల్గొన్నారు

# ఇటుకబట్టి పరిశ్రమకు ప్రత్యేక రహదారి ఏర్పాటు చేసుకోవాలి

దుమ్ము ధూళితో ప్రజలకు ఇబ్బందులు టిప్పర్లతో ప్రమాద భయం



**న్యూస్ ఇండియా ప్రతినిధి యాదగిరి కామారెడ్డి :**కామారెడ్డి జిల్లాపిట్లం మండలం గౌరారం గ్రామ శివారులో నూ తనంగా ఇటుకబట్టి పరిశ్రమ ఏర్పాటుతో భారీ టిప్పర్లు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గ్రామంలో దుమ్ము ధూళి తీవ్రంగా ఎగసిపడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టిప్పర్లు అధిక వేగంతో, నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు.

అలాగే టిప్పర్ల వైబ్రేషన్ కారణంగా ఇళ్లకు చీలికలు (క్రాకులు) వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే దుమ్ము నియంత్రణ చర్యలు చేపట్టి, వాహనాలు ఇటుక బట్టి సామాగ్రి తరలించడానికి వాహనాలకు ప్రత్యేక రహదారి ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కావున సంబంధిత అధికారులు దానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పేదలకు అండగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు


పండుగలా సాగిన పింఛన్ పంపిణీ



**అచ్యుతాపురం, న్యూస్ ఇండియా ప్రతినిధి :** రెండు మండలాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం ప్రజల్లో ఆనందాన్ని నింపింది. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికి సమయానికి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని పురోగతిపథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు లాలం భరత్, లాలం భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పింఛన్ అందని వారికి స్వచ్ఛందంగా సాయం చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, మండల ప్రధాన కార్యదర్శి కర్రెడ్ల ఈశ్వరరావు, పి.ఏ.సి.ఎస్ అధ్యక్షుడు ఎరిపల్లి చిట్టిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చొచ్చపట్ల గంగా వెంకట సాయి, యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్ది వెంకటరమణ, గ్రామ అధ్యక్షుడు అచ్చిబాబు, ఎంపీటీసీ అమలకంటి తాతాజీ, బద్ది సత్యారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఘనంగా గ్రామస్థులు సన్మానం



**కంచిలి న్యూస్ ఇండియా ప్రతినిధి :**మే డే కార్మిక దినోత్సవం సందర్భంగా బిన్నల గ్రామ నుండి బి ఈ ఎల్ కంపెనీలో జనరల్ మేనేజర్ స్థాయికి ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ జరిగిన బిన్నాల గ్రామస్థుడు గేమింగి. శ్యామలరావు దంపతులుకు శుక్రవారం గ్రామస్థులు ఘనంగా సన్మానం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఎం టి ఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి, ఇప్పిలి.క్రిష్ణ రావు,రట్టి.మాధవరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో జిల్లా టాపర్ గా కావ్యశ్రీ




శాలువాలతో ఘన సన్మానం, నగదు బహుమతులు అందజేత
లక్ష్యంతో చదువుకుంటే బంగారు భవిష్యత్తు
మల్లంపల్లి సర్పంచ్ బూర రాధిక హేమచంద్ర గౌడ్

**న్యూస్ ఇండియా :దుగ్గొండి,**ఇటీవల వెలుబడిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత పొంది వరంగల్ జిల్లా టాపర్ గా ఘనత సాధించిన మల్లంపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన జనగం కావ్య శ్రీ కి ప్రశంసలు వెల్లువెత్తాయి. శుక్రవారం దుగ్గొండి మండలం మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భార్గవి అధ్యక్షతన వరంగల్ జిల్లా టాపర్గా ఎస్ఎస్సి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన జనగాం కావ్య శ్రీ కి సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ బూర రాధిక హేమచంద్ గౌడ్ మాట్లాడుతూ లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదగడం ఖాయమని అన్నారు.నేటి విద్యార్థులు భవిష్యత్తుకు బంగారు బాటలు చదివే అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉన్నత చదువులు చదివి మల్లంపల్లి గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు.కావ్యశ్రీ కి రూ. 5 వేల నగదు తో పాటు పూలమాలతో సత్కరించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని తెలిపారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడుతున్నాయని ఎందుకు ఉదాహరణ కావ్య శ్రీ అని తెలిపారు. మాజీ సర్పంచ్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చుక్క రమేష్ గౌడ్ మాట్లాడుతూ చదువుతోపాటు అన్ని రంగాలలో విద్యార్థులు సాధించినప్పుడే గురువులకు తల్లిదండ్రులకు ఆనందదాయకం అని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు భార్గవి మాట్లాడుతూ కావ్య శ్రీ ఉన్నత చదువుతోపాటు క్రీడల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందని అన్నారు.పట్టుదలతో చదివిన విద్యార్థి కావ్యశ్రీ ఎస్ఎస్సి పరీక్షలలో 56 మార్కులతో 96 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో మొదటి స్థానం నుంచి ప్రభంజనం సృష్టించిందని తెలిపారు. నేడు కావ్య శ్రీ కి జిల్లా మొదటి టాపర్ కైవసం చేసుకోవడం వల్లనే మల్లంపల్లి హై స్కూల్ పేరు జిల్లా లెవల్లో మారుమోగుతుందని ఈ సందర్భంగా కొనియడారు.మండల జిల్లా స్థాయిలో ఉత్తీర్ణత సాధించి జిల్లా టాపర్ గా ఉన్న కావ్యశ్రీకి కపిల్ చిట్ ఫండ్ కంపెనీ మండల టాపర్ గా రూ.5 వేలు,జిల్లా టాపర్ గా రూ.1 లక్షా నగదు అందనున్నదని తెలిపారు.మూకాంబిక ఫౌండేషన్ నుండి రూ:5 వేలు బహుమతిగా ఇస్తారన్నారు.భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు కావటి శ్రీనివాస్ అలాగే మరో ఇద్దరు ఉపాధ్యాయులు శ్రీనివాస్,విశ్వరాజ్ గోపాల్ బృందం కావ్యశ్రీ కి రూ10 వేలు బహుమతి ప్రకటించారు.అదే పాఠశాల రెండవ టాపర్ వెండి మేఘన 5 వేలు బహుమతిగా ప్రకటించారు.

**కావ్యశ్రీకి తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రశంసలు**

మల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తడుక కొమురయ్య సువర్ణ మనవరాలు కావ్య శ్రీ ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన నేపథ్యంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి రూ.5 వేల నగదుతో శాలువాతో సన్మానించారు.

**మూకాంబిక ఫౌండేషన్ నుండి రూ. 5 వేలు బహుమతి**

మల్లంపల్లి హైస్కూల్ కు చెందిన జనగాం కావ్య ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి జిల్లా మొదటి టాపర్ గా ప్రతిభ కనబరిచింది. ఈ నేపథ్యంలో మూకాంబిక ఫౌండేషన్ నుండి రూ. 5 వేలు నగదు బహుమతిని అందజేశారు.పాఠశాల 3 టాపర్ గా ఉత్తీర్ణత సాధించగా అదే పాఠశాలకు చెందిన రఘునాదం అనే ఉపాధ్యాయుడు చిన్నారి డిగ్రీ చదివే వరకు 5 వేల చొప్పున నగదు బహుమతిని ఇస్తున్నామని ప్రకటించారు. అయితే తల్లిదండ్రులు లేని శిరీషకు గత కొన్ని సంవత్సరాలుగా స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నారని శిరీష తెలిపింది. అనంతరం పాఠశాల అధ్యాపకులు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తాత్కాలిక చార్ట్ మెమోలు అందజేశారు. ఈకార్యక్రమంలో గుడ్డేల్లులపల్లె సర్పంచ్ రాజు, మల్లంపల్లి ఉప సర్పంచ్ సూరయ్య, రిటైర్డ్ ఏఎస్ఐ ముత్యాల కుమారస్వామి గౌడ్, మహిళా సంఘ ప్రతినిధి రజిత, ఉపాధ్యాయురాలు పి.కృపాల్,ఆర్.దేవేందర్ , బి.మహేంద్రనాథ్,కె.శ్రీనివాసు,ఎన్.రఘునాధం,కె. సుధాకర్ ,తాజుద్దీన్ ,పద్మశ్రీ ,ఎన్. నాగేష్, గుడ్డెలుగులపల్లె మాజీ సర్పంచ్ జంగిలి రవి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగ నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల నుంచే ప్రపంచస్థాయి మేధావులు..

విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే మల్ రెడ్డి..
పది ఫలితాల్లో సర్కార్ బడుల విద్యార్థుల అద్భుత ప్రతిభ..
విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సన్మానం..

**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, మే 01, న్యూస్ ఇండియా ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల నుంచే దేశ చరిత్రలో ఎన్నో మేధావులు వెలిశారని, సరైన ప్రోత్సాహం లభిస్తే సర్కార్ బడుల విద్యార్థులే ప్రపంచస్థాయి ప్రతిభ కనబరుస్తారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ మండలాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను తొర్రూర్‌లోని తన క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నాణ్యమైన విద్య కార్పొరేట్ పాఠశాలల్లోనే లభిస్తుందన్న అపోహలను వీడాలని సూచించారు. తాజాగా వచ్చిన ప్రభుత్వ పాఠశాలల ఫలితాలే దీనికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి రేవంత్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇటీవల బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లకు పైగా కేటాయించడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, ప్రీ-ప్రైమరీ విస్తరణ వంటి కార్యక్రమాల ద్వారా విద్యా రంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఆరుట్లలో పైలట్ ప్రాజెక్టుగా అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ మోడల్ స్కూల్‌ను అభివృద్ధి చేసినట్లు, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చెప్పారు.



ముఖ్యమంత్రితో చర్చించి మరిన్ని నిధులు సాధించి నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అనవసరంగా కార్పొరేట్ విద్య కోసం లక్షలు ఖర్చు చేయవద్దని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

# మే డేస్ఫూర్తితో హక్కులకై పోరాడుదాం





ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 01 (మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్)**

శ్రమనే ఆస్తిగా రెక్కలు ముక్కలు చేసుకుని బతుకుతున్న కార్మిక వర్గం140 వ మే డే స్ఫూర్తితో హక్కులకై పోరాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు 140 మే డే సందర్భంగా తొర్రూరులోని పలు అనుబంధ యూనియన్ల జెండా ఆవిష్కరణ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని గంటల పెంపు తో కార్మికుల రక్త మాంసాలని ఖర్చు చేస్తూ దనికి వర్గానికి ఆస్తులు పోగేయటానికేనని అన్నారు. ఇప్పటికే ప్రపంచ కుబేరులు తయారు చేసిన మోడీ ప్రభుత్వం వారి ధన దాహానికి కార్మికులను బలి పశువులు చేస్తున్నారని ఆరొపిశీచారు. పెరిగిన ధరలకనుగొనంగా కనీస వేతనం 26000 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దొంగ నిద్రను నటిస్తున్నాయని అన్నారు. నూతన లేబర్ కోట్స్ అమలు వల్ల భారత రాజ్యాంగం ఇచ్చిన సంఘం పెట్టుకునే హక్కును కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. ఏడుగురితో రిజిస్ట్రేషన్ అయ్యే యూనియన్ వందమంది ఉంటేనే ఇకపై యూనియన్ ఏర్పడుతుందని 99 మంది వరకు శ్రమ చేసే కార్మికులు ఇకపై హక్కులు లేకుండా రెండవ శ్రేణి పౌరులుగా మోడీ ప్రభుత్వం పరిగణిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పరిపాలన అంటున్నరేవంత్ రెడ్డి ప్రభుత్వం 76 కనీస వేతనాల జీవోలకు గెజిట్ ముద్రించి అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 65 లక్షల మంది కార్మికులు ఈ జీవోల గెజిడ్ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారని తెలిపారు. 140 మే డే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. .................................. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ కార్మికుల ఐక్యమతమే పోరాటాలకు బలం అని అన్నారు. ఆ పోరాటాలలో సంపూర్ణ మద్దతు సహకారాన్ని తెలియజేస్తుందని ప్రకటించారు.........................................టి యు సి ఐ జిల్లా కోశాధికారి కే సంపత్,ఏరియా అధ్యక్ష కార్యదర్శులు ఎండి షరీఫ్ శ్రీరాం పుల్లయ్య. అర్వపల్లి వెంకన్న వేల్పుల మహేందర్, బైరి శ్రీనివాస్ వెంకన్న వడ్లకొండ లక్ష్మయ్య యాకయ్య, సెగ్గం నరేష్, బల్ల దేవేందర్ స్వామి గుండాల సోమ నరసయ్య తదితరులు మున్సిపల్ ఆఫీస్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రామకృష్ణ టాకీస్ ఏరియా ఆర్టీసీ డిపో ఏరియా లలో జెండాల ఆవిష్కరించి ప్రసంగించారు.



సొగసైన తెల్లటి స్ట్రాప్‌లెస్ పోర్ట్రెయిట్‌లో ప్రతిభా రాంత స్టన్‌లు

# పింక్ డ్రెస్ లో సెగలు పుట్టిస్తున్న కన్నడ కస్తూరి రుక్మిణి వసంత్



తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్, ప్రస్తుతం టాలీవుడ్ మరియు శాండల్ వుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారిపోయింది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు, తాజాగా పోస్ట్ చేసిన పింక్ డ్రెస్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. పద్ధతైన లుక్‌లో మాత్రమే కాదు, మోడ్రన్ డ్రెస్సుల్లో కూడా తాను అదరగొట్టగలనని రుక్మిణి నిరూపిస్తోంది.

**డ్రీమింగ్ ఇన్ పింక్.. అదిరిపోయిన ఫోటో షూట్:**

రుక్మిణి వసంత్ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో “డ్రీమింగ్ ఇన్ పింక్ టు నైట్ “ అంటూ కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఇందులో ఆమె ధరించిన పింక్ కలర్ డ్రెస్ చాలా స్టైలిష్‌గా మరియు మోడ్రన్‌గా ఉంది. సాధారణంగా సినిమాల్లో చాలా సింపుల్‌గా కనిపించే రుక్మిణి, ఇలాంటి గ్లామరస్ అవుట్ ఫిట్‌లో కనిపించడంతో ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఆమె కళ్ళలోని మెరుపు, ఆ డ్రెస్ లోని హొయలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి.

**ఆ డ్రెస్ స్పెషాలిటీ ఏంటో తెలుసా?:**

రుక్మిణి ధరించిన ఈ బేబీ పింక్ కలర్ డ్రెస్ ఒక లగ్జరీ లేబుల్ కి చెందినది. ‘ఇవఎవ ఎఎ +ఖఎతీఉవశ్రీశ్రీఖ’ అనే బ్రాండ్‌కు చెందిన ‘×ంశ్రీఖ ఇతీవంం’ లో ఆమె మెరిసిపోతోంది. ఇది మలాయ్ మరియు నెట్ ఫ్యాబ్రిక్స్‌తో తయారైన ఫ్లోర్ లెంగ్త్ గౌన్. అసమానమైన నెక్ లైన్, పొడవైన చేతులు మరియు ఒంటికి హత్తుకుపోయే బాడీకాన్ స్టైల్ లో ఉన్న ఈ డ్రెస్ లో రుక్మిణి తన అందాలను ఎంతో హుందాగా ఆరబోసింది.

**‘సప్త సాగరాలు దాటి’ తెచ్చిన క్రేజ్:**

కన్నడ చిత్రం ‘సప్త సాగరదాచే ఎల్లో’ తెలుగులో ‘సప్త సాగరాలు దాటి’ పేరుతో విడుదలై క్లాసిక్ హిట్ గా నిలిచింది. ఇందులో ప్రియా పాత్రలో రుక్మిణి నటనకు తెలుగు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఆ సినిమా తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వస్తున్నాయి. తరువాత నిఖిల్ సిద్ధార్థ సరసన ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ సినిమాతో నేరుగా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది.

**పాన్ ఇండియా సినిమాలతో బిజీ:**

రుక్మిణి వసంత్ ఇప్పుడు చిన్న సినిమాలే కాదు, ఏకంగా పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉంది. రిషబ్ శెట్టి ప్రతిష్టాత్మక చిత్రం ‘కాంతార: చాప్టర్ 1’ లో ఆమె ‘కనకవతి’గా హిట్ అందుకుంది. ఇక రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న ‘టాక్సిక్’ సినిమాలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే ఇక ఈ సినిమాతో ఆమె రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోవడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



వైట్ ట్యాంక్ టాప్ మరియు డెనిమ్ కోస్టల్ ఫోటోషూట్‌లో రాశి సింగ్ స్టన్స్

# ప్రభాస్ మేకర్స్.. అస్సలు తగ్గే ఆలోచనలోనే లేరా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుసగా భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన లైనప్ లో ఉన్న సినిమాలన్నీ హై బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాలే కావడం విశేషం. ఒకవైపు షూటింగ్స్, మరోవైపు రిలీజ్ ప్లాన్లతో మేకర్స్ ఎక్కడా తగ్గకుండా ముందుకు సాగుతున్నట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. నిజానికి.. ఇప్పుడు ప్రభాస్ చేతిలో ఫౌజీ, స్పిరిట్, కల్కి 2, సలార్ 2 వంటి క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్ సినిమాల షూటింగ్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆ రెండు చిత్రాల మేకర్స్ అనుకున్న షెడ్యూల్ కు కట్టుబడి పని చేస్తున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రకటించిన తేదీలకు సినిమాలు ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ప్రభాస్ అభిమానుల్లో ఆనందం నెలకొంది. ముందుగా ఫౌజీ విషయానికి వస్తే.. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఆ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. పీరియాడిక్ టచ్ తో రూపొందుతున్న ఆ సినిమాలో ప్రభాస్ వింటేజ్ లుక్ లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ సుమారు 80 శాతం పూర్తయిందని తెలుస్తోంది. ఇంకా మూడు భారీ యాక్షన్ ఎపిసోడ్లు మాత్రమే చిత్రీకరించాల్సి ఉందట. అవి పూర్తయితే మొత్తం షూటింగ్ కంప్లీట్ అవుతుందని వినికిడి. ఆ చిత్రంలో యాక్షన్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని యూనిట్ భావిస్తోంది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి 2026 చివర్లో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ టార్గెట్ పెట్టుకున్నారు. దసరా సీజన్ ను కూడా టార్గెట్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక స్పిరిట్ విషయానికి వస్తే.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రూపొందిస్తున్న ఆ చిత్రం కూడా భారీ అంచనాలు సొంతం చేసుకుంది. అర్జున్ రెడ్డి, యానిమల్ వంటి సినిమాలతో సంచలనం సృష్టించిన సందీప్, ఈసారి ప్రభాస్ ను పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా చూపించబోతున్నాడు. దీంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. అయితే ప్రభాస్ డేట్స్ విషయంలో కొంత ఇబ్బంది ఉందనే ప్రచారం గతంలో వినిపించింది. అయినప్పటికీ దర్శకుడు వంగా పక్కా ప్లానింగ్ షూటింగ్ ను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారట. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించి, ప్రకటించిన తేదీ అయిన 2027 మార్చి 5న సినిమాను విడుదల చేయాలని నిర్ణయంతో ఉన్నారని సమాచారం. గత కొంతకాలంగా ప్రభాస్ సినిమాలు తరచూ వాయిదాలు పడుతున్నాయి. కానీ ఫౌజీ, స్పిరిట్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ముందుగానే స్క్రిప్ట్ పనులు పూర్తి చేసి, క్లియర్ ప్లానింగ్ తో షూటింగ్స్ నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఇప్పుడు ప్రభాస్ సినిమాల విషయంలో ఈసారి మేకర్స్ అస్సలు తగ్గేలా కనిపించడం లేదు. ఫిక్స్ చేసుకున్న షెడ్యూల్ లకు కట్టుబడి, సమయానికి సినిమాలను రిలీజ్ చేయాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ఇదే కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రభాస్ అభిమానులకు వరుస పండుగలు ఖాయం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి చూడాలి డార్లింగ్ అప్ కమింగ్ మూవీస్ ఎలాంటి విజయాలు సాధిస్తాయో..

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com